క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో సిరులతల్లి..

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆవో రమేష్‌నాయుడు తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జగదభిరాముని పట్టాభిషేకం

దాబాగార్డెన్స్:నగరంలోని జగదాంబ జంక్షన్ మహారాణిపేటలో గల అంబికాబాగ్ శ్రీ సీతా రామచంద్రస్వామి ఆలయంలో సీతారామ కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం పట్టాభిషేకం ఘనంగా నిర్వహించారు. ముందుగా లక్ష్మణ సమేత సీతారాముల ఉత్సవమూర్తులకు చక్రస్నానం చేశారు. పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. స్వామివారిని సింహాసనంపై కూర్చోబెట్టి పట్టాభిషేక ఘట్టాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం 5 గంటల నుంచి రథోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో రమేష్‌నాయుడితో పాటు ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, కార్యనిర్వాహక ఇంజినీర్ సీహెచ్‌వీ రమణ, పులి రామారావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదాపై హర్షం

దాబాగార్డెన్స్: అసెంబ్లీ సమావేశాల్లో దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా ఇవ్వాలని ప్రవేశపెట్టిన బిల్లు ఏకగ్రీవంగా ఆమోదించడం, ఆ బిల్లును పార్లమెంట్‌కు పంపించడం హర్షించదగ్గ విషయమని ఆంధ్రప్రదేశ్ బిషప్స్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ పేర్కొన్నారు. నగరంలోని ఓ హోటల్లో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు చేతులు దులుపుకున్నాయని ఆరోపించారు. అదే సమయంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. దళిత క్రైస్తవులందరూ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ, ఆయన వెంట నడిచేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పాస్ చేసిన 1998 సర్క్యులర్‌ను ఉపసంహరించాలని ప్రవీణ్ అభ్యర్థించారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ బిషప్స్ కౌన్సిల్ అధ్యక్షుడు బిషప్ బాలరాజు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సుభాష్‌కు జాతీయ స్థాయి అవార్డు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల విద్యార్థి ఎస్.సుభాష్ జాతీయ స్థాయిలో బెస్ట్ యూత్ అవార్డు పొందారు. ఇటీవల హరియాణాలో జరిగిన జాతీయ స్థాయి యూత్ రెడ్ క్రాస్ క్యాంప్‌లో 17 దేశాల నుంచి 44 విశ్వవిద్యాలయాలకు చెందిన 187 మంది క్యాడెట్‌లు పాల్గొన్నారు. వారిలో రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించిన సుభాష్ జాతీయ స్థాయిలో ఉత్తమ యూత్ అవార్డ్ సాధించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి శుక్రవారం తన కార్యాలయంలో సుభాష్‌ను అభినందించారు. విద్యార్థి దశ నుంచి సేవా భావం అలవరచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయ కాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లలో సత్తా



సౌకర్యం సెంటర్‌లో బకాయిలు చెల్లిస్తున్న ప్రజలు

- జీవీఎంసీ జోన్–4 ఆదాయం రూ. 58 కోట్లు
- రాయితీని ఉపయోగించుకున్న ప్రజలు
- గత ఏడాది కంటే 15 శాతం అధికంగా వసూలు

జగదాంబ: పన్ను వసూళ్లలో జీవీఎంసీ జోన్–4 సత్తా చాటింది. ఈ ఏడాది రూ. 58 కోట్ల ఆదాయం ఆర్జించింది. ఆస్తి, ఖాళీ స్థలాలు, నీటి పన్నుకు సంబంధించి జీవీఎంసీ ప్రకటించిన రాయితీని ప్రజలు సద్వినియోగం చేసుకున్నారు. వడ్డీ రాయితీ సమాచారం ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లడంతో ఈ మేరకు వసూలు సాధ్యమైంది. గత ఏడాది రూ.50 కోట్లు



పన్ను చెల్లింపు ప్రక్రియను పరిశీలిస్తున్న జెడ్సీ శివప్రసాద్

వసూలు కాగా.. ఈ ఏడాది రెవెన్యూ అధికారులతో పాటు సెక్రటరీలు కీలక భూమిక పోషించడంతో ఈ ఏడాది 15 శాతం పెరిగి రూ. 58 కోట్ల 20 లక్షల ఆదాయం వచ్చింది. మార్చి నెల చివరి రెండు రోజులు పన్ను వసూళ్లలో మరింత ఊపు కనిపించి రూ. 3 కోట్ల 40 లక్షలు వసూలు అయింది. జోనల్ కార్యాలయంలో ఉన్న సౌకర్యం సెంటర్‌తో పాటు సచివాలయాల్లోనూ పన్నులు స్వీకరించారు. ఆఖరి రోజు ప్రజల రద్దీ దృష్ట్యా జోనల్ కమిషనర్ శివప్రసాద్ కార్యాలయం రెండవ అంతస్తులోనూ సౌకర్యం సెంటర్ ఏర్పాటు చేసి చెక్కులు, డీడీలు తీసుకున్నారు. దీంతో పన్ను చెల్లింపులో సౌలభ్యం చేకూరి ప్రజలకు ఉపశమనం లభించింది. దీంతో జీవీఎంసీ జోన్–4 పన్ను వసూళ్లలో దూకుడు కనబరిచి గత ఏడాదిని మించి వసూలు చేసినట్లు అయింది.

బాలుడికి అరుదైన చికిత్స



సమావేశంలో మాట్లాడుతున్న అను ఇనిస్టిట్యూట్ చైర్మన్ డాక్టర్ రమేష్

మహారాణిపేట : అను ఇనిస్టిట్యూట్ వైద్యులు మోయా మోయా అనే అరుదైన వ్యాధితో పక్షవాతం బారినపడిన 11 ఏళ్ల బాలుడి మెదడుకు బైపాస్ సర్జరీ చేసి, అతడు కోలుకునేలా చేయగలిగినట్టు న్యూరో అండ్ కార్డియాక్ సైన్సెస్ చైర్మన్ డాక్టర్ జి.రమేష్ చెప్పారు. ప్రముఖ న్యూరోసర్జన్ డాక్టర్ సందీప్ తలారి మాట్లాడుతూ కాకినాడకు చెందిన 11 ఏళ్ల బాలుడికి పక్షవాతం రావడంతో, ఎడమ వైపు శరీర భాగాలు ప్రభావితమయ్యాయని, పలు చోట్ల తిప్పి చికిత్స చేసినా ఉపయోగం కనిపించలేదన్నారు. బాలుడు మోయా మోయా అనే అత్యంత అరుదైన వ్యాధితో బాధపడుతున్నట్లు తమ వద్ద నిర్ధారణ అయిందన్నారు. ఈ వ్యాధి కారణంగా మెదడుకు రక్తాన్ని సరఫరా చేసే ప్రధాన రక్తనాళాలు కుంచించుకుపోయి పక్షవాతం వస్తుందన్నారు. ఆ సమస్యని సరి చేస్తే వ్యాధిని నయం చేయవచ్చని వివరించారు. తమ వైద్యుల బృందం బాలుడికి శస్త్ర చికిత్స విజయవంతంగా పూర్తి చేశామని, బాలుడు కోలుకుంటున్నాడని తెలిపారు. వైద్య బృందాన్ని అను చైర్మన్ డాక్టర్ రమేష్ అభినందించారు. ఈ సమావేశంలో యూనిట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీలలిత, న్యూరో ఫిజీషియన్ డాక్టర్ ఎంజీవీ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్‌లో ప్రదర్శనలు



ప్రదర్శనను ప్రారంభిస్తున్న ముఖ్య అతిథి డాక్టర్ చక్రవర్తి

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో శుక్రవారం సైకాలజీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో మానసిక పరీక్షలు, ప్రదర్శనలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా కేజీహెచ్ పీడియాట్రిక్ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ డాక్టర్ చక్రవర్తి పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తుల్లో ఉండే నాయకత్వ లక్షణాలు, ఎదుగుదల లోపాలు, మానసిక బలహీనతలను గుర్తించడానికి ఈ పరీక్షలు ఉపయోగపడతాయన్నారు. విశాఖ ఉమెన్స్ డిగ్రీ కళాశాల, ఆంధ్ర యూనివర్సిటీ నుంచి సుమారు 2 వేల మంది ప్రదర్శనను తిలకించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షైజీ తెలిపారు. కార్యక్రమంలో పీడీ డాక్టర్ రాజ్యలక్ష్మి, డాక్టర్ రూపా సెల్వరాజ్, డాక్టర్ శర్వాణి, డాక్టర్ జయలక్ష్మి, డాక్టర్ లక్ష్మీప్రభ, డాక్టర్ అరుణ తదితరులు పాల్గొన్నారు.


పాఠశాలకు 100 బెంచీల వితరణ



వేదాంత గ్రూప్ అందజేసిన బెంచీలపై కూర్చున్న మేయర్ హరివెంకటకుమారి తదితరులు

దాబాగార్డెన్స్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనలో వేదాంత గ్రూప్ సహకారం ఎనలేనిదని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు. జోన్–4 పరిధి లక్ష్మీటాకీస్ సమీపాన గల జీవీఎంసీ ఎంవీడీఎం ఉన్నత పాఠశాలకు వేదాంత గ్రూప్ సీఈవో సతీష్ నగర మేయర్ చేతుల మీదుగా 100 బెంచీలు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ స్థానిక కార్పొరేటర్, ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సభ్యుడు మహ్మద్ సాదిక్ విన్నపం మేరకు ఎంవీడీఎం హైస్కూల్లో పిల్లలు కూర్చునేందుకు 100 బెంచీలను వేదాంత గ్రూప్ అందజేయడం సంతోషకరమన్నారు. వేదాంత గ్రూపు గతంలో చాలా పాఠశాలలకు ఆర్వో ప్లాంట్లు అందించిందని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే టాప్–3లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా అనేక పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారని, విద్యార్థులకు మంచి విద్య అందించేందుకు 15 రకాల పౌష్టికాహారాన్ని పిల్లలకు ఇస్తున్నారని అన్నారు. దీనిలో భాగంగానే ఇటీవల రాగిజావను మెనూలో కూడా చేర్చారన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మహ్మద్ సాధిక్, చైతన్య స్రవంతి వ్యవస్థాపకురాలు డాక్టర్ షిరీన్ రహ్మాన్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శేషుకుమారి, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే కాలుష్య నియంత్రణ



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ హరివెంకటకుమారి

దాబాగార్డెన్స్: కాలుష్య నియంత్రణకు అందరి సహకారం అవసరమని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, జీవీఎంసీ సంయుక్తంగా నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాంపై నగరంలోని ఓ హోటల్లో శుక్రవారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో పాల్గొన్న మేయర్ జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాలుష్య నియంత్రణకు ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, ఖాళీ ప్రాంతాల్లో చెట్లు పెంచే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని, పరిశ్రమల నుంచి వచ్చే వాయు కాలుష్యం నియంత్రణకు ఆయా సంస్థల యాజమాన్యాలు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా తన వంతు బాధ్యతగా వారంలో ఒక్క రోజు సొంత వాహనాన్ని వదిలి ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించనున్నట్లు తెలిపారు. జీవీఎంసీ యంత్రాంగం ప్రతి సోమవారం సొంత వాహనాలు వదిలి ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగిస్తున్నారని తెలిపారు. అలాగే ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థ యాజమాన్యాలు వారి సిబ్బందితో పాటు వారు కూడా వారంలో ఒక రోజు ప్రజా రవాణా ఉపయోగించడం వల్ల కాలుష్యాన్ని కొంత మేరకైనా తగ్గించవచ్చని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కాలుష్య నియంత్రణకు విశేష కృషి చేస్తున్నారని, ప్లాస్టిక్ నియంత్రణ, తీర ప్రాంతం వెంబడి మొక్కల పెంపకం, పారిశుధ్యం తదితర పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీసీ రాజారత్నం, కృష్ణ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రామకృష్ణారావు, ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సీనియర్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ నాగార్జున, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

బాలల సంక్షేమానికి సమష్టి కృషి అవసరం

ఏయూ క్యాంపస్: చైల్డ్‌లైన్ నోడల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రిసోర్స్ ఆర్గనైజేషన్‌పై జిల్లా స్థాయి సమావేశం శుక్రవారం ఆంధ్ర విశ్వవిద్యాలయం ఐఏఎస్ఈలో నిర్వహించారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ బాలల సంక్షేమం, భద్రతలో విభిన్న ప్రభుత్వ శాఖలు, ఎన్‌జీవోలు సమష్టిగా పని చేయాలని సూచించారు. బాలల హక్కులను కాపాడం, అమలు చేయడంలో రాజీ పడవద్దన్నారు. వార్డు సచివాలయ సిబ్బందిని భాగస్వాములను చేస్తూ పనిచేస్తే బాల్య వివాహాలను పూర్తిస్థాయిలో అరికట్టడం సాధ్యపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.వెంకటేశ్వరి, ఏయూ ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, ఆర్.పూర్ణిమదేవి, ఎం.ఆర్.ఎల్ రాధిక పాల్గొన్నారు.

పరిశుద్ధ శిలువ మార్గం నిర్వహణ



శిలువ మార్గాన్ని చూపిస్తున్న ఫాదర్

కంచరపాలెం : క్రీస్తునందు భయభక్తులు కలిగి ఉండి జీవనం సాగించాలని జ్ఞానాపురం పునీత పేతురు ప్రధాన దేవాలయం రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ అన్నారు. పాస్కా కాలం 5వ శుక్రవారాన్ని పురస్కరించుకుని జ్ఞానాపురం రక్షణగిరిలో పరిశుద్ధ శిలువ మార్గం ఘనంగా నిర్వహించారు. ఫాదర్ ప్రకాశ్ మాట్లాడుతూ క్రీస్తునందు భయ భక్తులు కలిగి ఉండడం ద్వారా ముక్తి లభిస్తుందన్నారు. అనంతరం దివ్యబలిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో పీపీసీ సభ్యులు, క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు. ఏప్రిల్ 7న జరగనున్న గుడ్‌ఫ్రైడే వేడుకలకు రక్షణగిరిని ముస్తాబు చేస్తున్నట్లు కమిటీ నిర్వాహకుడు బేతా జోసెఫ్ తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ధర్నా

మహారాణిపేట : ఎస్సీ, ఏబీసీడీ వర్గీకరణపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఎంఆర్‌పీఎస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్‌కు ఎంఆర్‌పీఎస్ జిల్లా ఇన్‌చార్జి మొర్ల రమణ ఆధ్వర్యంలో నాయకులు వినతిపత్రం సమర్పించారు. అనంతరం రమణ మాట్లాడుతూ పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కణితి నాగరాజు, కస్తూరి వెంకటరావు, తూర్పు నియోజకవర్గం ఇన్‌చార్జి కడితి మరియదాస్, భీమిలి ఇన్‌చార్జి మునపర్తి పైడిరాజు, కడితి ఈశ్వరరావు, బాదం హనుమంతురావు, చొక్కాకుల రాంబాబు, మారెడిపూడి బంగారయ్య, నానిబాబు, జామి గోవిందరావు, నెహేమ్యా తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాల పెంపే లక్ష్యంగా సదస్సుల నిర్వహణ

ఏయూ క్యాంపస్: విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించే దిశగా సదస్సుల నిర్వహణ జరగాలని ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. శుక్రవారం సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో నిర్వహించిన 'రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ సివిల్ ఇంజినీరింగ్ మెటీరియల్స్ అండ్ ప్రాక్టీసెస్' సదస్సును ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ వర్తమాన జ్ఞానాన్ని అందించే విధంగా సదస్సు నిర్వహించడం శుభపరిణామమన్నారు. విభాగాధిపతి ఆచార్య సి.ఎన్.వి.సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ సంప్రదాయ విధానాలు, అధునాతన పద్ధతులపై అవగాహన కల్పించారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ తీసుకువస్తున్న నియమావళిని స్వాగతిస్తామన్నారు. ఫ్యాకల్టీ ఆఫ్ ఇంజినీరింగ్ చైర్మన్ ఆచార్య డి.ఎస్.ఆర్.మూర్తి నిర్మాణ రంగంలో సవాళ్లు, విధానాలు అంశంపై ప్రసంగించారు. విభాగ పూర్వ ఆచార్యులు జి.వెంకటప్పారావు జియో సింథటిక్స్, మెటీరియల్స్, రీయిన్‌ఫోర్స్‌డ్ సాయిల్ స్ట్రక్చర్స్, నేల స్వభావాల ఆధారంగా నిర్మాణాలు తదితర అంశాలను వివరించారు.

శ్రీరామ నవమిని పురస్కరించుకుని భారీ అన్నదానం



ప్రసాద్‌గార్డెన్స్‌లో అన్నదానం చేస్తున్న విల్లూరి భాస్కరరావు

జగదాంబ: శ్రీరామ నవమిని పురస్కరించుకుని శుక్రవారం ప్రసాద్‌గార్డెన్స్‌లో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శ్రీరామ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు మాట్లాడుతూ యుగాలు మారినా శ్రీరాముడు ఆదర్శంగా నిలుస్తారని అన్నారు. అనంతరం నాలుగు వేల మందికి అన్నదానం చేశారు. సంఘానికి విల్లూరి ఫౌండేషన్ ద్వారా సహకారం అందిస్తామని అన్నారు.

జ్ఞానాపురంలో..

కంచరపాలెం: జ్ఞానాపురం శ్రీసీతారామాలయంలో సీతారామ కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్ నేతృత్వంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పాల్గొని అన్నదానం ప్రారంభించారు. సుమారు 2 వేల మందికి అన్నదానం చేసినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు వర్కింగ్ ప్రెసిడెంట్ వి.వేళంగిణీరాజు, దేవి, ఈశ్వరి బాబ్జీ, కమల్‌కుమార్, శ్రీను, రమేష్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకుందాం



దీక్షలో పాల్గొన్న అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కమిటీ నాయకులు

సీతమ్మధార : ప్రజలకు అన్ని విధాలా సేవలందించి ఆదుకుంటున్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌పరం కాకుండా రక్షించుకోవాలని ఐద్వా విశాఖ జిల్లా కార్యదర్శి వై.సత్యవతి పిలుపునిచ్చారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన రిలే నిరసన దీక్షలు 729వ రోజుకు చేరుకున్నాయి. ఈ కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో విశాఖ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలు తమ వంతు పాత్ర పోషించి ప్రజలకు భరోసాగా నిలిచాయన్నారు. విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు నినాదంతో ఉద్యమం రాష్ట్రవ్యాప్తంగా జరిగిందన్నారు. వేలాది ఎకరాల భూమి త్యాగం చేసి స్థానికులు నిర్వాసితులయ్యారని తెలిపారు. జనవరి 30వ తేదీకి రెండు సంవత్సరాలు పూర్తి అయిన ఉక్కు ఉద్యమం పోరాట స్ఫూర్తితో ముందుకెళ్లడం గొప్ప విషయమన్నారు. కార్పొరేటీకరణ విధానాలు అమలు చేసిన ఏ దేశం అభివృద్ధి సాధించలేదని గుర్తు చేశారు. ఇప్పటికైనా మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాలు మానుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కె.మణి, ఆర్.వరలక్ష్మి, ఎ.పుష్ప, కె.సంతోషం, బి.భారతి, డి.కొండమ్మ, సుజాత, ఆర్.విమల, కె.వేణు తదితరులు పాల్గొన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి



సమావేశమైన ఎంజీఎం పాఠశాల పూర్వ విద్యార్థులు

దాబాగార్డెన్స్: పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని మహాత్మాగాంధీ ఉన్నత పాఠశాల 1983–84 పూర్వ విద్యార్థులు ప్రస్తుత విద్యార్థులకు సూచించారు. ఆ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. విద్యార్థులకు హాల్ టిక్కెట్లు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్‌వీఎస్ఎన్ నాగభూషణం మాట్లాడుతూ మంచి మార్కులతో ఉత్తీర్ణులై ఇటు పాఠశాల, అటు తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని అభిలషించారు. ఎటువంటి ఒత్తిడికి గురి కాకుండా పరీక్షలు ప్రశాంతంగా రాయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పరీక్షా సామగ్రి అందజేసి, పాఠశాలకు మంచి పేరు తేవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బాదిరెడ్డి కృష్ణ, శంకరరావు, పట్నాల శ్రీను, పిల్లా రాజు, శ్రీనివాసరావు, సాగర్, కృష్ణ, శ్రీధర్, హరి, బేగం, వెంకటలక్ష్మి, కిరణ్‌మాలని, వాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌కు విశేష స్పందన



34వ వార్డులో లబ్ధిదారుకు ఆరోగ్యశ్రీ కార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి తదితరులు



36వ వార్డులో మహిళకు ఆర్థిక సహకారం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

అల్లిపురం: ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శుక్రవారం 36వ వార్డు జామియా మసీదు, 34వ వార్డు అచ్చియ్యమ్మపేట వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌కు విశేష స్పందన లభించింది. 34వ వార్డులో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో 35వ వార్డుకు చెందిన దల్లి అప్పన్న తనకు ఆరోగ్యం బాగులేని కారణంగా రైస్‌కార్డు, ఆరోగ్య శ్రీ కార్డు ఇప్పించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ఆరోగ్య శ్రీ కార్డు అందజేశారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు తోట పద్మావతి, విల్లూరి భాస్కరరావు, సీనియర్ నాయకులు లింగం శ్రీనివాసరావు, లండా రమణ, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ బోణి దేవ, బొర్రా శ్రీనివాసరెడ్డి, వాసుపల్లి నారాయణ, దూడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

36వ వార్డులో..

జామియా మసీదు వద్ద జరిగిన కార్యక్రమంలో రంగిరీజు వీధికి చెందిన మహేంద్ర ధనలక్ష్మి కుటుంబ పోషణ కష్టంగా ఉందని ఎమ్మెల్యేకు తెలియజేయడంతో రూ.2 వేలు ఆర్థిక సహకారం అందజేశారు. మరో ముగ్గురికి మందుల ఖర్చుల నిమిత్తం వెయ్యి చొప్పున అందజేశారు. ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కనకమహాలక్ష్మి దేవస్థానం చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, 36వ వార్డు అధ్యక్షుడు మాసిపోగు రాజు, 30వ వార్డు అధ్యక్షుడు దశమంతుల మాణిక్యాలరావు, 38వ వార్డు అధ్యక్షుడు సంకాభక్తుల సన్యాసిరావు, ఎల్లపు రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్

- నినాదం మార్మోగాలు : ఎమ్మెల్యే వాసుపల్లి



పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుపల్లి

అల్లిపురం: 'జగనన్నే మా భవిష్యత్'అనే నినాదంతో 2024 సార్వత్రిక ఎన్నికల్లో మరల జగన్‌మోహన్‌రెడ్డిని రెండవ సారి ముఖ్యమంత్రిగా గెలిపించుకునే దిశగా కార్యకర్తలు పనిచేయాలని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు అశోక్‌నగర్‌లో గల ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం ఆయన నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. సచివాలయ గృహసారథులు, కన్వీనర్లు ప్రతి ఇంటికి వెళ్లి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందించిన సంక్షేమ ఫలాలను గుర్తు చేయాలన్నారు. ప్రతి కార్యకర్త తమ బైక్, ఆటో, కార్లకు జగనన్నే మా భవిష్యత్ స్టిక్కర్లను, జగనన్న ఫొటోతో ఉన్న సెల్ స్టిక్కర్లతో ప్రజల ముందుకు వెళ్లాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ, కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం చైర్మన్ కొల్లి సింహాచలం, జేసీఎస్ ఇన్‌చార్జి దొడ్డి రామానంద్, కర్రి నీలకంఠం, పీతల వాసు, కార్పొరేటర్లు బిపిన్ జైన్, తోట పద్మావతి, విల్లూరి భాస్కరరావు, మాసిపోగు రాజు, కోడిగుడ్ల శ్రీధర్, ఆళ్ల లీలావతి, ఆళ్ల శ్రీను, జీవీఎంసీ కో ఆప్షన్ మెంబర్ షరీఫ్, వార్డు అధ్యక్షులు దశమంతుల మాణిక్యాలరావు, మూలే రామిరెడ్డి, అలపన కనకరెడ్డి, సంకాభక్తుల సన్యాసిరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు ఉగాది పురస్కారాలు



కళాకారుడిని సత్కరిస్తున్న అతిథులు

అల్లిపురం: కళాకారులే ప్రగతి సేవకులని ప్రముఖ సినీనటుడు ప్రసన్నకుమార్ అన్నారు. విశాఖ కళాకారుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఉగాది అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా పలువురు కళాకారులను అతిథులు సత్కరించారు. సినిమా రంగం నుంచి ప్రముఖ సినీనటుడు ప్రసన్నకుమార్, కంచర్ల ఉపేంద్ర, ధనుంజయ పట్నాయక్, ప్రముఖ మెజీషియన్ బీఎన్ రెడ్డి, శాస్త్రీయ నృత్యం ఫక్కీఅరుణ్‌సాయి, గాయకులు జట్టి ప్రసాద్, శ్రీనివాస్, వెస్టర్న్ డ్యాన్స్ నుంచి సంతోష్‌కుమార్, జానపద రంగం నుంచి మార్య సంగ్వి, నేహా అక్షయ్, పాడుతా తీయగా ఫేమ్ సత్విక్, విశాఖ జిల్లా మహిళా అధ్యక్షురాలు బయ్యవరపు రాధలకు అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ స్కూల్ విద్యార్థులు, పలు సంస్థల కళాకారులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, బొడ్డేపల్లి రఘు, వీజేఎఫ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.